సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
మంగళవారం
28-01-2025
పేజీలు: 02




## టిక్‌టాక్‌ను కొనుగోలు చేయనున్న మైక్రోసాఫ్ట్

ప్రముఖ షార్ట్ వీడియో యాప్ టిక్‌టాక్ అగ్రరాజ్యం అమెరికాలో మూగబోయిన విషయం తెలిసిందే. జనబాహుల్యంలో విశేష ఆదరణ పొందిన ఈ షార్ట్ వీడియో యాప్ సేవలను మళ్లీ పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు జోరందుకున్నాయి. చైనా కంపెనీ బైట్‌డ్యాన్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న దీనిని సొంతం చేసుకునేందుకు మిస్టర్ బీస్ట్‌గా పిలిచే అమెరికన్ యూట్యూబర్ జిమ్మీ డొనాల్డ్‌సన్, ఎలాన్ మస్క్‌తోపాటు ఒరాకిల్ వంటి సంస్థలు ప్రయత్నిస్తున్నాయంటూ ప్రచారం జరిగింది. తాజాగా ఈ జాబితాలో మైక్రోసాఫ్ట్ చేరింది. టిక్‌టాక్‌తో మైక్రోసాఫ్ట్ చర్చలు జరుపుతున్నట్లు స్వయంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. అయితే దీనిపై అటు టిక్‌టాక్ గానీ, మైక్రోసాఫ్ట్ గానీ స్పందించలేదు. టిక్‌టాక్ కొనుగోలుపై తాను వివిధ కంపెనీలు, నిపుణులతో చర్చిస్తున్నట్లు ట్రంప్ గతంలో చెప్పిన విషయం తెలిసిందే. కాగా, అమెరికాలో టిక్‌టాక్ సేవలు ఈ నెల 19 నుంచి నిలిచిపోయాయి. చైనా ప్రభుత్వంతో టిక్‌టాక్ సంబంధాలపై అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది. దీంతో 2024లో అప్పటి అమెరికా ప్రెసిడెంట్ జో బైడెన్.. ఈ ఏడాది జనవరి 19 నాటికి టిక్‌టాక్‌ను బైట్‌డాన్స్ విక్రయించేయాలని.. లేదంటే అమెరికాలో నిషేధం ఎదుర్కోవాలనే చట్టాన్ని తీసుకొచ్చారు.



## ఫిబ్రవరిలో వైట్‌హౌజ్‌కు మోదీ: డోనాల్డ్ ట్రంప్

ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఫిబ్రవరిలో మోదీ వైట్‌హౌజ్‌ను విజిట్ చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. దేశాధ్యక్షుడిగా రెండో సారి ఎన్నికైన ట్రంప్‌తో.. సోమవారం ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడారు.ఆ ఫోన్ సంభాషణ గురించి ట్రంప్ వెల్లడించారు. ఫ్లోరిడాలోని జాయింట్ బేస్ ఆండ్రూస్ నుంచి ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో వెళ్తున్న సమయంలో ట్రంప్ రిపోర్టర్లతో మాట్లాడారు. భారత ప్రధాని మోదీతో ఫోన్‌లో మాట్లాడనని, ఆయన వైట్‌హౌజ్‌కు రానున్నారని, బహుశా ఫిబ్రవరిలో ఆయన శ్వేతసౌధాన్ని విజిట్ చేసే ఛాన్సు ఉన్నట్లు తెలిపారు. ఇండియాతో తమకు మంచి రిలేషన్ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. మోదీతో ఫోన్‌లో అన్ని అంశాల గురించి చర్చించినట్లు తెలిపారు. తొలి సారి దేశాధ్యక్షుడిగా చేసిన సమయంలో.. ట్రంప్ తన చివరి పర్యటన ఇండియాకే వచ్చారు. ఆ ఇద్దరి మధ్య మంచి రిలేషన్ ఉన్నది. 2019లో హూస్టన్‌లో జరిగిన ర్యాలీలో.. 2020 ఫిబ్రవరిలో అహ్మదాబాద్‌లో జరిగిన ర్యాలీలో ఇద్దరూ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.



## భార్య వేధింపులు తట్టుకోలేక భర్త సూసైడ్

భార్య వేధింపులతో మరో భర్త సూసైడ్ చేసుకున్నారు. KAలోని హుబ్లీలో పీటర్, ఫిబీ(పింకీ)లకు రెండేళ్ల కిందట పెళ్లి కాగా, మనస్పర్థలతో 3నెలలుగా విడిగా ఉంటున్నారు. 'నా భార్య నన్ను చంపుతోంది. నేను చనిపోవాలని ఆమె కోరుకుంది' అని పీటర్ రాసిన సూసైడ్ నోట్ వైరలవుతోంది. విడాకుల కోసం ఫిబీ సోదరుడు రూ.20 లక్షలు డిమాండ్ చేశాడని, ఆఫీస్ మీటింగ్‌లో ఉండగా భార్య గొడవపడటంతో పీటర్ జాబ్ పోయిందని మృతుడి తండ్రి చెప్పారు.



## ప్రభుత్వ హాస్టల్‌లో మరో విద్యార్థి మృతి.. పట్టించుకోని సర్కార్!

తెలంగాణ రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు విద్యార్థుల పాలిట యమపాశాల్లా మారాయి. ఇప్పటికే గురుకుల హాస్టళ్లలో చదువుతున్న పలువురు విద్యార్థులు మృతి చెందగా.. తాజాగా మరో ప్రభుత్వ హాస్టల్ విద్యార్థి మృతి చెందిన ఘటన వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల ఏదుట్ల గ్రామానికి చెందిన ఉడుముల వెంకటస్వామి, అరుణ దంపతులకు ఇద్దరు కుమారులు. వెంకటస్వామి హైదరాబాద్‌లోని లింగంపల్లిలో రెండేండ్ల కిందట తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందాడు. అప్పటి నుంచి అరుణ కూలీ పనులు చేసుకొని పిల్లలను పోషిస్తుంది. అరుణ పెద్ద కుమారుడు భరత్ (13) గోపాల్‌పేట ఎస్సీ బాలుర ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం ఉదయం భరత్ స్నానం చేసి స్టడీ అవర్‌లో విద్యార్థులతో కలిసి చదువుకుంటున్నాడు. ఇంతలో అకస్మాత్తుగా కిందపడిపోవడంతో పాఠశాల సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తీసుకు వెళ్లారు. అయితే అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కొడుకు మృతిచెందడంతో అరుణ బోరున విలపించింది. రెండేండ్ల కిందట భరత్ తండ్రి వెంకటస్వామిని పోగొట్టుకున్న అరుణ.. ఇప్పుడు కొడుకు భరత్ కూడా మరణించడంతో గుండెలు బాదుకుంటూ విలపించిన తీరు ప్రతి ఒక్కరినీ కలచి వేసింది. దీంతో బీఆర్ఎస్వీతోపాటు పలు విద్యార్థి సంఘాల నాయకులు దవాఖాన వద్దకు చేరుకొని ప్రధాన రహదారిపై మృతదేహంతో బైటాయించి ధర్నాకు దిగారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషి యా చెల్లించాలని డిమాండ్ చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో వరుసగా విద్యార్థులు మృత్యువాత పడుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండటం ఏంటని ప్రశ్నించారు. ఘటనా స్థలానికి ఆర్డీ వో సుబ్రహ్మణ్యం, డీఎస్పీ వెంకటేశ్వర్లు చేరుకొని విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఏం చేయడానికైనా సిద్ధమేనా అని అడిగారు.. కాస్టింగ్ కౌచ్‌పై నటి షాకింగ్ కామెంట్స్




సినీ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ అంశం ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. అవకాశాల కోసం వెళ్లినప్పుడు, చిత్రీకరణ సమయంలో కొందరు తారలు కాస్టింగ్ కౌచ్‌కు గురవుతున్నారు. తమకు ఎదురైన ఆ చేదు అనుభవాలను ఏదో ఒక సందర్భంలో బయటపెడుతున్నారు. తాజాగా సౌత్ ఇండస్ట్రీలో కాస్టింగ్ కౌచ్ గురించి బాలీవుడ్ నటి ఫాతిమా సనా షేక్ షాకింగ్ కామెంట్స్ చేశారు. అమీర్ ఖాన్ నటించిన 'దంగల్' సినిమాతో తెరంగేట్రం చేసిన ఫాతిమా సనా షేక్ తన కెరీర్ తొలినాళ్లలో ఎదురైన కాస్టింగ్ కౌచ్ అనుభవాలను ఓ ఇంటర్వ్యూలో తాజాగా పంచుకున్నారు. 'ఓ సినిమా కోసం ఆడిషన్‌కు వెళ్లాను. అక్కడ మీరు ఏం చేయడానికైనా సిద్ధమేనా..? అంటూ ఓ డైరెక్టర్ నన్ను అడిగాడు. కష్టపడి పనిచేస్తానని.. నా పాత్ర కోసం ఏది అవసరమో అది చేస్తానని చెప్పా. కానీ, అతను మాత్రం అదే ప్రశ్న మళ్లీ మళ్లీ అడిగాడు. నేను కూడా అతడు ఎంతకు దిగజారతాడో చూద్దామని ఏమీ తెలియనట్లే ప్రవర్తించాను' అని ఫాతిమా తనకు ఎదురైన చేదు అనుభవం గురించి తెలిపింది. ఇక సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో ప్రొడ్యూసర్లు కాస్టింగ్ కౌచ్ గురించి ఓపెన్‌గా మాట్లాడుకుంటారని నటి పేర్కొంది. దక్షిణాది సినిమాలో అవకాశం కోసం హైదరాబాద్‌కు వచ్చినప్పుడు తనకు ఎదురైన ఓ అనుభవాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. హైదరాబాద్‌లో ఓ నిర్మాతను కలిసిన అనుభవాన్ని పంచుకుంటూ.. 'నిర్మాతలు కాస్టింగ్ కౌచ్ గురించి చాలా ఓపెన్‌గా మాట్లాడతారు. మీకు తెలుసా.. ఇక్కడ మీరు కొందరిని కలవాల్సి ఉంటుంది అనేవాళ్లు. ఆ విషయం నేరుగా చెప్పేవాళ్లుకాదు. ఎలా చెప్పినా వారి ఉద్దేశమైతే అదే అని తెలిసిపోయేది' అని ఫాతిమా చెప్పుకొచ్చారు. నటి కామెంట్స్ ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి.



## ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు సేనాపతి క్రిస్ గోపాలకృష్ణన్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదైంది. ఆయనతోపాటు మాజీ ఐఐఎస్సీ డైరెక్టర్ బలరాంతో, మరో 16 మందిపై బెంగళూరులో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తాజాగా వెల్లడించారు. 2014లో వీరంతా ఓ హనీ ట్రాప్ కేసులో తప్పుగా ఇరికించారని, అంతేకాకుండా ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఫ్యాకల్టీ విధుల నుంచి తనను తొలగించారంటూ మాజీ ఐఐఎస్సీ ప్రొఫెసర్ దుర్గప్ప ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా కులం పేరుతో తనను దూషించి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు 71వ సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టు ఆదేశాల మేరకు సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదుచేసినట్లు పోలీసులు వెల్లడించారు.



## మీర్‌పేట్ ఘటన.. గురుమూర్తి గురించి షాకింగ్ విషయాలు

మీర్‌పేట్‌లో భార్యను ముక్కలుగా నరికిన గురుమూర్తి గురించి అతడి సహోద్యోగులు ఆసక్తికర విషయాలు బయటపెట్టారు. నిందితుడు పనిచేసే డీఆర్‌డీఓలో పోలీసులు విచారించారు. 'గురుమూర్తి ఎంతో క్రమశిక్షణతో ఉంటాడు. ఎవరైనా సాయం అడిగితే కాదనడు. ఆయనది మెతక వైఖరి. ప్లాస్టిక్ వస్తువులు వాడేందుకు ఇష్టపడడు. కాఫీ, భోజనానికి కూడా స్టీల్ పాత్రలు ఉపయోగించేవాడు. ఇరుగుపొరుగుతో ఎక్కువగా మాట్లాడడు' అని సహోద్యోగులు తెలిపారు.



## సనాతన్ పరిరక్షణ బోర్డు వచ్చేనా!

మహా కుంభమేళా జరుగుతున్న వేళ 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'పై మళ్లీ చర్చ మొదలైంది. నిన్న ప్రయాగ్‌రాజ్‌లో నాగ, వివిధ అఖాడాల సాధువులతో HM అమిత్‌షా సుదీర్ఘంగా చర్చించారు. వారు సనాతన్ పరిరక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని కోరినట్టు తెలిసింది. అలాగే ఆలయాలు, దేవుడి మాన్యాలు, ఆస్తులను ప్రభుత్వ పరిధి నుంచి తప్పించాలని కోరారు. గతంలో పవన్ కళ్యాణ్ సైతం ఇదే డిమాండ్ చేశారు. మరి కేంద్రం ఈ మొర ఆలకించేనా?



## మిస్టర్ 360 ఫామ్‌లోకి వస్తాడా?

టీమ్ ఇండియా టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ రాణిస్తున్నా బ్యాటింగ్‌లో మాత్రం విఫలమవుతున్నారు. చివరి 5 టీ20 ఇన్నింగ్స్‌లలో 12, 0, 1, 4, 21 రన్స్ మాత్రమే చేశారు. దీంతో ఇవాళ ENGతో జరిగే మూడో టీ20లోనైనా ఆయన ఫామ్‌లోకి రావాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు. గత ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటివరకు SKY 19 ఇన్నింగ్స్‌లలో 441 రన్స్ చేశారు. యావరేజ్ 24.50గా ఉంది.

## టెన్త్ విద్యార్థులకు సర్కార్ గుడ్ న్యూస్

పదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సెలవుల్లోనూ వారికి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఇందులో భాగంగా ఫిబ్రవరి 2 నుంచి మార్చి 10 వరకు విద్యార్థులకు భోజనం అందించాలని విద్యాశాఖను ప్రభుత్వం ఆదేశించింది. ఫిబ్రవరి 2 నుంచి మార్చి 10 వరకు రెండు రెండో శనివారాలు, ఆరు ఆదివారాలు ఉన్నాయి. ఆ రోజుల్లో విద్యార్థులకు భోజనం అందించాలని ఇప్పటికే ఉత్తర్వులు వెలువడ్డాయి.

## BJPలోకి అంబటి రాయుడు?

టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు బీజేపీలో చేరతారని తెలుస్తోంది. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన ఏబీవీపీ సభల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సదస్సులో ఆయన బీజేపీకి అనుకూలంగా వ్యాఖ్యలు చేశారు. దేశం కోసం పని చేసే పార్టీ బీజేపీ ఒక్కటేనని ఆకాశానికెత్తారు. అప్పటి నుంచి ఆయన కాషాయ పార్టీ గూటికి చేరతారని వార్తలు వస్తున్నాయి. కాగా రాయుడు గతంలో వైసీపీలో చేరారు. అనంతరం ఆ పార్టీని వీడి జనసేన పార్టీతో కనిపించారు.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4 PM



# అందాలతో పిచ్చెక్కిస్తున్న ఆకాంక్ష శర్మ

హాట్ అందాలతో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తుంది రాజస్థాన్ బ్యూటీ ఆకాంక్ష సింగ్. ఒంపు సొంపులతో మతిపోగోడుతుంది. వరుస సినిమా ఆఫర్స్‌తో ఈ భామ ఫుల్ బిజీగా ఉంది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఈ సందరాంగి అందాలకు నెటిజన్లు ఫిదా అవుతున్నారు. లేలేత అందచందాలతో కుర్రకారును తెగ అట్రాక్ట్ చేస్తుంది ఆకాంక్షశర్మ. సినిమా ఆఫర్స్‌తో పాటు వాణిజ్య ప్రకటనలతో ఫుల్ జోరులో ఉంది. ఫోటో షూట్‌లో వయ్యారాలన్నీ ఒలకబోస్తూ తెగ అట్రాక్ట్ చేస్తుంది. ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు దక్షిణాదిపై దృష్టిపెట్టింది. తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన పిక్స్ వైరల్ అవుతున్నాయి.

## ధనుష్, నయనతార మధ్య వివాదం..

# నెట్ ఫ్లిక్స్ పిటిషన్‌ను కొట్టేసిన కోర్టు

'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీ విషయంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, తమిళ స్టార్ నటుడు ధనుష్ మధ్య వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ఈ డాక్యుమెంటరీలో పర్మిషన్ లేకుండా 'నేనూ రౌడీనే' మూవీలోని మూడు సెకండ్ల క్లిప్పింగ్‌ను వాడుకున్నారంటూ ధనుష్ గతేడాదిన నవంబర్‌లో మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. నయన్ దంపతులతోపాటు వారికి చెందిన రౌడీ పిక్చర్స్‌పై దావా వేశారు. అయితే, ధనుష్ దావాను నెట్‌ఫ్లిక్స్ సవాల్ చేసింది. ధనుష్ చేసిన కాపీరైట్ దావాను తిరస్కరించాలంటూ నెట్‌ఫ్లిక్స్ ఇండియా మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

ఇంతకీ ఏం జరిగిందంటే..?

నయన్.. ధనుష్ మధ్య గతకొంత కాలంగా వార్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. నయనతార పెళ్లితో పాటు ఆమె జర్నీకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే డాక్యుమెంటరీని రూపొందించింది. ఈ డాక్యుమెంటరీ ప్రస్తుతం ఓటీటీలో స్ట్రీమింగ్




అవుతోంది. అయితే, ఈ డాక్యుమెంటరీలో ధనుష్ నిర్మాతగా వ్యవహరించిన 'నేనూ రౌడీనే' మూవీ షూటింగ్ క్లిప్పింగ్స్‌ని వాడుకున్నారు. ఆ క్లిప్పింగ్‌ను డాక్యుమెంటరీలో వాడుకునేందుకు అనుమతి లేకపోవడంతో అందుకు నష్టపరిహారంగా 10కోట్ల రూపాయలు డిమాండ్ చేస్తూ నయనతార టీమ్‌కు ధనుష్ లీగల్ నోటీసులు పంపారు. దాంతో మనసు నొచ్చుకున్న నయనతార.. ధనుష్‌కు భారీ లెటర్‌ని రాసింది. ఇందులో ఆయనపై తీవ్ర విమర్శలు చేసింది. దీంతో ఆగ్రహించిన ధనుష్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు నయన్ దంపతులపై దావా వేశారు. ధనుష్ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం.. విచారణకు అంగీకరించింది. ఈ క్రమంలోనే నయనతార దంపతులతోపాటు నెట్‌ఫ్లిక్స్‌కు నోటీసులు జారీ చేసింది. దీంతో ధనుష్ చేసిన కాపీరైట్ దావాను తిరస్కరించాలంటూ నెట్‌ఫ్లిక్స్ ఇండియా పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

## గంభీర్‌కు అదే ఆఖరి సిరీస్ కావొచ్చు: ఆకాశ్ చోప్రా

ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌ను తప్పించాలన్న డిమాండ్లు వినబడ్డాయి. అయితే, బీసీసీఐ గంభీర్‌కు మరింత సమయం ఇవ్వొచ్చని వ్యాఖ్యాత ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. 'భారత్ ఈ ఏడాది ఇంగ్లండ్‌లో ఆడే టెస్టు సిరీస్ వరకు గంభీర్‌ను BCCI కొనసాగించొచ్చు. ఒకవేళ ఆ సిరీస్ కూడా కోల్పోతే ఇక భారత కోచ్‌గా ఆయనకు అదే ఆఖరి సిరీస్ అయ్యే అవకాశం ఉంది' అని పేర్కొన్నారు.






## రేపటి నుంచి RC16 షూటింగ్‌లో రామ్ చరణ్!

బుచ్చిబాబు డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న RC16 షూటింగ్ రెండు షెడ్యూల్స్ పూర్తయ్యింది. రేపటి నుంచి HYDలో కీలమైన మూడో షెడ్యూల్ ప్రారంభం కానుంది. ఇందులో రామ్ చరణ్, జాన్వీ పాల్గొంటారని సమాచారం. గుండె ఆపరేషన్ తర్వాత కోలుకుంటున్న కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ కూడా త్వరలో జాయిన్ అవుతారని తెలుస్తోంది. ఉత్తరాంధ్ర నేపథ్యంలో ఓ ఆటతో ముడిపడి ఉన్న కథాంశంతో ఈ మూవీ ఉంటుందని, 'పెద్ది' అనే టైటిల్ పరిశీలనలో ఉందని టాక్.

## CISFలో 1,124 ఉద్యోగాలు

సీఐఎస్ఎఫ్ 1,124 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కానిస్టేబుల్/డ్రైవర్, డ్రైవర్ కమ్ పంప్ ఆపరేటర్, డ్రైవర్ ఫర్ సర్వీస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మెట్రిక్యులేషన్‌తోపాటు డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. 21 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉన్నవారు అర్హులు. జీతం నెలకు రూ.21,700 నుంచి రూ.69,100 వరకు ఉంటుంది. https://cisfrectt.cisf.gov.inలో దరఖాస్తు చేసుకోవాలి. ఫిబ్రవరి 3 నుంచి మార్చి 4 వరకు అప్లై చేసుకోవచ్చు.



## కడియం అంతుచూసేవరకూ నిద్రపోను: తాటికొండ రాజయ్య

MLA కడియం శ్రీహరిపై BRS మాజీ మంత్రి తాటికొండ రాజయ్య తీవ్రస్థాయిలో మండిపడ్డారు. 'కడియం అంతు చూసేవరకూ నేను నిద్రపోను. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఏ అభివృద్ధీ లేదు. అవకాశవాదైన కడియం పప్పులు కాంగ్రెస్‌లో ఉడకవు. ఆ పార్టీ మంత్రులు సొంత దుకాణాలు తెరుచుకున్నారు. భట్టి విక్రమార్క భార్య సహా ఆ పార్టీ క్యాబినెట్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి అవినీతిమయం' అని ఆరోపించారు.





## అన్నదాతల అకౌంట్లలో రూ.579 కోట్లు జమ

రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద రూ.579 కోట్లు విడుదల చేసింది. దీంతో విడతల వారీగా అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయి. తొలి రోజు 4.41 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.569 కోట్లు జమ చేసింది. అలాగే 18,180 రైతు కూలీ కుటుంబాలకు రూ.6 వేల చొప్పున రూ.10.91 కోట్లు అందించింది. మరి ఈ పథకాల కింద మీ అకౌంట్లలో డబ్బులు పడ్డాయో లేదో కామెంట్ చేయండి.

## నేడు ప్రొద్దుటూర్‌కు సీఎం రేవంత్

సీఎం రేవంత్ ఇవాళ రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం ప్రొద్దుటూర్‌లో పర్యటించనున్నారు. అక్కడ 150 ఎకరా విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ఎక్స్‌పీరియం పార్కు'ను ఆయన ప్రారంభిస్తారు. ఇదే కార్యక్రమంలో సినీ నటుడు చిరంజీవి కూడా పాల్గొంటారు. కాగా రూ.450 కోట్ల వ్యయంతో రామ్‌దేవ్ రావు ఈ పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో 85 దేశాల నుంచి అనేక రకాల జాతుల మొక్కలు, చెట్లను తీసుకొచ్చి ఇక్కడ పెట్టారు.

